క్లుప్తంగా

శ్రీనివాస్‌గౌడ్‌కు డాక్టరేట్


డాక్టరేట్ పొందిన శ్రీనివాస్‌గౌడ్

నడిగూడెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న కొల్లు శ్రీనివాస్‌గౌడ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి శనివారం డాక్టరేట్ పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్స్ కళాశాలలో గల ప్రభుత్వ పాలన విభాగం ప్రొఫెసర్ బి.అమరేందర్‌రెడ్డి పర్యవేక్షణలో సూర్యాపేట, భువనగిరి మున్సిపాలిటీల్లో ఘన వ్యర్థాల తీరుపై పరిశోధన చేసి సమర్పించిన సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయం అధికారులు ఆమోదించారు. దీంతో శ్రీనివాస్ గౌడ్‌కు డాక్టరేట్ అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్‌ను ఇంటర్మీడియట్ జిల్లా అధికారి జానపాటి కృష్ణయ్య, నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మన్నెం సోమయ్య, అధ్యాపకులు అభినందించారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన విద్యార్థులు


గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

మునగాల : మండల కేంద్రంలో గల సాయి గాయత్రి విద్యాలయానికి చెందిన పలువురు విద్యార్థులు శనివారం తమ సృజనాత్మక శక్తిని పెంపొందించుకునేందుకు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మండల కేంద్రంలో గల గ్రంథాలయాన్ని సందర్శించారు. ఇందులో భాగంగా విద్యార్థులు గ్రంథాలయ అధికారిని పలు ప్రశ్నలు అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అర్వపల్లి శంకర్, ఉపాధ్యాయులు వి.అంజయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఐసెట్ ప్రథమ ర్యాంకర్ శరణ్‌కుమార్‌కు సన్మానం


శరణ్ దంపతులను సన్మానిస్తున్న సభ్యులు

హుజూర్‌నగర్ : ఇటీవల వెలువడిన ఐసెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన పట్టణానికి చెందిన నూకల శరణ్‌కుమార్‌ను శనివారం స్థానిక శ్రీ షిరిడీ సాయి సమాజం కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజల అనంతరం శరణ్ దంపతులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు టి.అంజయ్య, సెక్రటరీ వి.నాగేశ్వరరావు, మల్లికార్జునరావు, నిర్మల, నిశిత, తేజశ్రీ, సూరయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఏడీ రవికుమార్

నడిగూడెం : విద్యుత్ సరఫరాలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఏడీ రవికుమార్ కోరారు. శనివారం మండల కేంద్రంలో మునగాల, మోతె మండలాలకు చెందిన విద్యుత్ సిబ్బందికి విద్యుత్ భద్రతా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లులు వసూలు చేయాలన్నారు. సమావేశంలో మునగాల, మోతె మండలాల ఏఈలు వికాస్, రాజేష్, సబ్ ఇంజినీర్‌లు సాయిబాబా, శ్రీనివాసరెడ్డి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు


సమావేశంలో మాట్లాడుతున్న నవీన్‌కుమార్

గరిడేపల్లి : కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి కార్మికుడికి లేబర్ డిపార్ట్‌మెంట్ వారు ఉచిత పనినైపుణ్యానికి శిక్షణలు నిర్వహించాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు చింతమళ్ల సైదులు, జ్వాల నాగేశ్వర్‌రావు, గుంజ నర్సింహారావు, హుస్సేన్, తురక శ్రీను, నాగరాజు, హుస్సేన్, గంగారావు, సైదమ్మ, ఎల్లమ్మ తదితరులున్నారు.

ప్రశాంతంగా గ్రూప్- 4 పరీక్ష

- కోదాడలోని మూడు సెంటర్లలో ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అనుమతించని అధికారులు

కోదాడఅర్బన్ : తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్–4 పరీక్ష పట్టణంలో ప్రశాంతంగా జరిగింది. శనివారం ఉదయం, మధ్యాహ్నం రెండు పేపర్లకు పట్టణంలోని 23సెంటర్లలో పరీక్షను నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆయా పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు ఉదయం 8గంటల నుంచే చేరుకున్నారు. కాగా పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎం పాఠశాల, కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల, ఎస్వీ డిగ్రీ కళాశాల సెంటర్లకు ఒకొక్కరు చొప్పున ఆలస్యంగా రావడంతో వారిని అధికారులు అనుమతించలేదు. అప్పటికే సమయం మించి పోవడంతో పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేయడంతో వారు వెనుదిరిగారు. కాగా పరీక్షలు రాసేందుకు మహిళా అభ్యర్థినులు ఎక్కువగా వచ్చారు. అదే విధంగా మధ్యాహ్నం పరీక్షకు ఉదయం రాసిన అభ్యర్థులు కొన్ని సెంటర్ల వద్ద ఆలస్యంగా రావడంతో వారిని మానవతా దృక్పథంతో అనుమతించారు. పరీక్ష కేంద్రాలను ముగ్గురు తహసీల్దార్లు, కోదాడ డీఎస్పీ, సీఐలు పర్యవేక్షించారు. ప్రతి పరీక్షా కేంద్ర వద్ద 144వ సెక్షన్‌ను అమలు చేశారు. కోదాడ ఆర్టీసీ డిపో ఉదయం, సాయంత్రం ప్రత్యేక సర్వీసులను నడిపింది.

హుజూర్‌నగర్ : పట్టణంలో శనివారం నిర్వహించిన గ్రూప్ – 4 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలో మొత్తం 7పరీక్షా కేంద్రాల్లో 2,136 మంది అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాటు చేశారు. కాగా ఓ పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన ఓ అభ్యర్థిని అధికారులు లోనికి అనుమతించలేదు.


హుజూర్‌నగర్ : పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు


కోదాడఅర్బన్ : పరీక్షకు చంటి బిడ్డతో వచ్చిన అభ్యర్థి

నేరేడుచర్ల : ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్–4 పరీక్షలు శనివారం మండల కేంద్రంలో ప్రశాంతంగా జరిగాయి. మున్సిపల్ కేంద్రంలోని శ్రీవాణి, ప్రగతి, జెడ్పీ పాఠశాలతో పాటు స్పందన జూనియర్ కళాశాల, మండల పరిధిలోని సిటి సెంట్రల్ స్కూల్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను వెనక్కుపంపించారు. ఆయా పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ శంకరయ్య, ఎస్‌ఐ నవీన్‌కుమార్ తనిఖీలు నిర్వహించారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించారు.

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి మోడల్‌స్కూల్‌లో శనివారం నిర్వహించిన గ్రూప్–4 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు మొత్తం 336మంది అభ్యర్థులకు గాను 275మంది హాజరైనట్లు తహసీల్దార్ జి.కార్తీక్ తెలిపారు.

చిలుకూరు : ప్రభుత్వం శనివారం నిర్వహించిన గ్రూప్ -4 పరీక్ష మండలంలో ప్రశాంతంగా ముగిసింది. మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను తనిఖీ చేసి పంపించారు.


హుజూర్‌నగర్‌లో పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు


చిలుకూరులోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో తనిఖీ చేస్తున్న సిబ్బంది


నేరేడుచర్లలోని శ్రీవాణి స్కూల్ వద్ద తనిఖీ చేస్తున్న సిబ్బంది

రైతుల సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యం


కోదాడరూరల్ : కాపుగల్లులో జెండాను ఆవిష్కరిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ సూర్యం

కోదాడరూరల్ : రైతుల సంక్షేమమే లక్ష్యంగా సహకార సంఘాలు పనిచేస్తున్నాయని కాపుగల్లు పీఏసీఎస్ చైర్మన్ నంబూరి సూర్యం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. సహకార సంఘాలతో రైతులకు మరిన్ని సేవలు అందుతున్నాయని, వాటిని మరింత బలోపేతం చేసుకుందామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు నల్లూరి రమేష్, ముత్తవరపు వీరయ్య, రైతులు లక్ష్మయ్య, రాజు, వెంకటేశ్వరరావు, లక్ష్మీనర్సయ్య, సీతరాములు, సిబ్బంది ఉన్నారు.

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) అందిస్తున్న సేవలను రైతులు ఉపయోగించుకోవాలని దొండపాడు పీఏసీఎస్ చైర్మన్ కలగొట్ల కోటిరెడ్డి అన్నారు. శనివారం చింతలపాలెం మండలంలోని దొండపాడు పీఏసీఎస్‌లో అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కార్యాలయం ఆవరణలో సహకార జెండా ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఈ ఖరీఫ్‌లో రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉంచుతామన్నారు. సహకార సంఘం ద్వారా రైతులకు ప్రస్తుతం స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు తక్కువ వడ్డీకే అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మల్లెల వెంకటరెడ్డి, పోలకట్ల వెంకటేశ్వర్లు, కొర్రా హట్యా, కార్యదర్శి పసుపులేటి రమేష్, దుగ్గి విజయ్, అమరారపు అశోక్, రైతులు బాబు, అంకిరెడ్డి తదితరుల పాల్గొన్నారు.


హుజూర్‌నగర్ : దొండపాడులో జెండాకు వందనం చేస్తున్న చైర్మన్, సభ్యులు, సిబ్బంది

ఘనంగా ఎస్‌బీఐ వార్షికోత్సవం

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి గ్రామంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో వార్షికోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ముందుగా బ్యాంక్‌లో సిబ్బంది కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ ఎంకె సుకుమార్ మాట్లాడుతూ.. దేశంలోని పురాతన వాణిజ్య బ్యాంకు ఎస్‌బీఐ అని అన్నారు. ఎస్‌బీఐ జూలై 1న 67ఏళ్లు పూర్తి చేసుకుందని తెలిపారు. ప్రపంచంలోనే అతి పెద్ద బ్యాంకు కోల్‌కత్తాలో స్థాపించబడిందని, భారత ఉపఖండంలోనే అతి పురాతనమైన బ్యాంకు ఎస్‌బీఐ అని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్లు సురేందర్, అకౌంటెంట్ శ్రీనివాస్, బ్రాంచ్ స్టాఫ్ రవితేజ, సుమంత్, ఆశీష్, గురునాధ్, శేషాద్రి, సైదులు, కనకయ్య తదితరులున్నారు.


కేక్ కట్ చేస్తున్న బ్యాంకు సిబ్బంది

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి


హుజూర్‌నగర్‌రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్

హుజూర్‌నగర్‌రూరల్ : అర్హులైన పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రేపు (సోమవారం) నిర్వహించే కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూం ఇళ్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలంలోని పేద ప్రజలు ఇళ్ల స్థలాలు, సొంత ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బూరుగడ్డ గ్రామంలో పూర్తైన డబుల్ బెడ్ రూం ఇళ్లను పేద ప్రజలకు వెంటనే పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంటి స్థలం ఉన్న నిరుపేదలకు గృహలక్ష్మి పథకం కింద రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. పలు సమస్యలపై కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నామని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు మాదూరి నర్సింహాచారి, వెంకటరెడ్డి, రాములు, వీరయ్య, భిక్షం, వెంకటయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం : ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రేపు (సోమవారం) నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడిని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ కోరారు. శనివారం మండల పరిధిలోని వేణుగోపాలపురం, కరివిరాల, చెన్నకేశ్వాపురం గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన మాట్లాడారు. అర్హులైన పేదలందరికీ గృహలక్ష్మి పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ కొరట్ల శ్రీనివాస్, రేఖ తిరపయ్య, ఎస్‌కె.మస్తాన్, కేశగాని భద్రయ్య, పిచ్చయ్య, జీడయ్య, విజయ్‌కుమార్, వెంకన్న, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

మోతె : కార్మిక శాఖ కార్యాలయాలు అవినీతి పరులకు, దళారులకు అడ్డాగా మారాయని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్క సోమయ్యగౌడ్ అన్నారు. జూలై 7న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను మండల కేంద్రంలో శనివారం ఆయన ఆవిష్కరించారు. జిల్లాలో కార్మిక శాఖ అధికారుల నిర్లక్ష్యంతో భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. వెల్ఫేర్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉన్న వాటిని పరిష్కరించడంలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని, అందుకు నిరసనగా జూలై 7న కలెక్టరేట్ ఎదుట మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మిక శాఖ కార్యాలయాల్లో అధికారుల అవినీతికి హద్దు అదుపు లేదన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఒగ్గు సైదులు, ప్రధాన కార్యదర్శి కంకనాల అంజి, గార్ల రంగయ్య, జాని తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి


తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న చిన్నారులు, ఎమ్మార్పీఎస్ నాయకులు

కోదాడరూరల్ : అనాథ పిల్లలను ఆదుకుంటామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మహజన సోషలిస్ట్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఏపూరి రాజుమాదిగ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం నిర్వహించిన దీక్షలో ఆయన మాట్లాడారు. 8సంవత్సరాల కిందట అనాథ పిల్లలకు గురుకుల పాఠశాల ఏర్పాటు చేస్తామని, వారికి ప్రత్యేక రిజర్వేషన్లు కల్పిస్తామని, స్మార్ట్‌కార్డులు అందజేస్తామని, కేజీ టూ పీజీ ఉచిత విద్యను అమలు చేస్తామని హామీ ఇచ్చి నేటికి అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. హామీలను అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఇటుకల రమేష్, ఏపూరి సత్యరాజు, అంజయ్య, శ్రీను, అశోక్, లక్ష్మయ్య, రాజు, వినయ్, సాత్విక్, విజయ్, బాలు, వరుణ్ తదితరులు ఉన్నారు.

రాజ్యాధికార సాధనలో బీసీలు ఐక్యంగా పోరాడాలి


మాట్లాడుతున్న వెంకటరమణాచారి

మునగాల : రాజ్యాధికార సాధనలో భాగంగా బీసీలు ఐక్యంగా పోరాడాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఇనుగుర్తి వెంకటరమణాచారి, మండల అధ్యక్షుడు చింతకాయల నాగరాజు కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివారం కోదాడలోని పెరిక భవన్‌లో ఉదయం 10గంటలకు నిర్వహించే బీసీ సంక్షేమ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా బీసీలకు బీసీ బంధు ప్రకటించి రూ.10లక్షల సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నిగడాల వీరయ్య, దేశగాని సైదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్‌ఎస్


మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిని అభినందిస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు సయ్యద్‌నిజామ్

మఠంపల్లి : బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో విసుగెత్తిన ప్రజల నుంచి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి విశేష స్పందన లభిస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు సయ్యద్‌నిజామ్, పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రయ్య అన్నారు. శనివారం మండలంలోని రఘునాథపాలెంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ, అనుబంధ సంఘాల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీ సాధిస్తుందన్నారు. ఈ సందర్భంగా మైనార్టీసెల్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా అక్బర్‌పాషాను, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పసుపులేటి జానయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ కె.చెన్నయ్య, నాగుల్‌మీరా, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యులు భగవంతుడితో సమానం


హుజూర్‌నగర్ : వైద్యులను సన్మానిస్తున్న సీనియర్ సర్జన్ దశరథనాయక్


హుజూర్‌నగర్ రూరల్ : మండల వైద్యాధికారిణి సనను సన్మానిస్తున్న వైద్యసిబ్బంది

హుజూర్‌నగర్‌రూరల్ : వైద్యులు భగవంతుడితో సమానమని, తల్లిదండ్రులు జన్మనిస్తే వైద్యులు పునర్జన్మనిస్తారని వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇందిరాల రామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని లింగగిరిలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణి డాక్టర్ సనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. కరోనా కష్టకాలంలో వైద్యులు ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలను రక్షించారని, వైద్యులను సన్మానించడం సమాజానికి గౌరవప్రదమన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది యరగాని హైమావతి, స్టాఫ్ నర్సులు జ్యోతి, స్వాతి, ఫార్మాసిస్ట్ సంతోషి, వైద్యసిబ్బంది, ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో శనివారం వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులను, సిబ్బందిని శాలువాలతో సన్మానించి పుష్పగుచ్చాలు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ కరుణ్‌కుమార్, వైద్యవిధాన పరిషత్ ప్రభుత్వ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు, సీనియర్ సర్జన్ డాక్టర్ దశరథ నాయక్, ఆర్‌ఎంఓ డాక్టర్ నక్క రవి, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ వనజ, నాగమణి, వెంకటాద్రి, వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

మునగాల : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వరల్డ్ డాక్టర్స్ డే సందర్భంగా శనివారం వైద్యాధికారి రవీందర్‌ను వాసవీక్లబ్ గ్రేటర్, వాసవీవనితా క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం స్థానిక బస్టాండ్‌లో సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ గవర్నర్ వంగవేటి వెంకటగురుమూర్తి, ఆర్యవైశ్య పెద్దలు అర్వపల్లి శంకర్, వనితా క్లబ్ అధ్యక్షురాలు అర్వపల్లి పద్మ, వాసవి క్లబ్ కార్యదర్శి చక్కా కిశోర్, కోశాధికారి అర్వపల్లి రామారావు, కళ్యాణి పాల్గొన్నారు.


మునగాల : వైద్యాధికారి రవీందర్‌ను సన్మానిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటి ప్రచారం


హుజూర్‌నగర్ : ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న వేముల శేఖర్‌రెడ్డి, నాయకులు

హుజూర్‌నగర్ : ప్రధాని మోదీ పాలనలో దేశం సుభిక్షంగా ఉందని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి అన్నారు. మేరా బూత్ సబ్‌సే మజ్బూత్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ 9ఏళ్ల పాలనలో పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేశారని, బీజేపీ ప్రభుత్వం దేశంలో సుపరిపాలన అందిస్తూ ప్రజల మన్ననలను పొందుతుందన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు బీజేపీకి మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ డి.రామరాజు, అల్పకాలిక విస్తారక్ జి.శివకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, శశికళ, ఉమామేశ్వరరావు పాల్గొన్నారు.

మఠంపల్లి : మండలంలోని కొత్తతండా, జామ్లాతండా, దొనబండతండా తదితర గ్రామాల్లో శనివారం బీజేపీ ఇంటింటి ప్రచారాన్ని రెండోరోజు కొనసాగించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి మాట్లాడారు. మహాజన సంపర్క్ యోజనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటి ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేషంగా స్పందన వస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దుండిగాల ఎల్లయ్య, నాయకులు రామకృష్ణ, వెంకటేశ్వర్లు, బాలునాయక్, రాజు పాల్గొన్నారు.

జనగర్జన సభను జయప్రదం చేయాలి

మఠంపల్లి : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర ముగింపును పురస్కరించుకుని ఖమ్మంలో నేడు నిర్వహిస్తున్న జనగర్జన సభను కార్యకర్తలంతా హాజరై జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్ కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంటిపులి శ్రీనివాస్, కె.నాగరాజు, తదితరులున్నారు.

దేవాలయంలో హుండీ చోరీ


వెంచర్‌లో పడి ఉన్న హుండీ

చిలుకూరు: చిలుకూరు బస్టాండ్ సెంటర్‌లో గల వీరాంజనేయ స్వామి దేవాలయంలోని హుండీని శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేశాడు. వివరాలు.. శనివారం ఉదయం చిలుకూరు గ్రామ శివారులోని ఓ వెంచర్‌లో హుండీని గమనించిన స్థానికులు వెంటనే ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీసీ కెమెరాలు పరిశీలించగా.. తెల్లవారుజామున 3గంటల సమయంలో ముఖానికి మంకీ క్యాప్ ధరించిన వ్యక్తి ఆలయంలోకి చొరబడి హుండీని దొంగిలించి గ్రామ శివారులో గల వెంచర్‌లో దానిని పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లినట్లు రికార్డయ్యిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కాగా దేవాలయంలో ఇటీవలే నూతనంగా స్వామి వారి విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన జరిగింది. ఆ సమయంలో భక్తులు కానుకలు హుండీలో వేశారు. హుండీలో సుమారుగా రూ.2 లక్షల వరకు కానుకలు ఉంటాయని దేవాలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై విచారణ చేపట్టనున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు.

గోపాలపురంలో గోరింటాకు పండుగ


గోరింటాకు పండుగలో పాల్గొన్న మహిళలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండల పరిధిలోని గోపాలపురంలో విన్నపం ఒక పోరాటం అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం గోరింటాకు పండగను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు చీకూరి లీలావతి పాల్గొని మాట్లాడారు. ఆషాడమాసంలో వచ్చే రుగ్మతలను తట్టుకుని చర్మరోగాలు, స్త్రీలలో గర్భసంచి సమస్యలను గోరింటాకు నివారిస్తుందని మహిళల నమ్మకమని ఆమె తెలిపారు. ఎన్నో ఔషధాలతో కూడిన గోరింటాకును ప్రతిఒక్కరూ పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ మున్సిపల్ కౌన్సిలర్లు దొంతగాని పద్మ శ్రీనివాస్‌గౌడ్, అట్లూరి మంజులహరిబాబు, శిరీష, రమాదేవి, గిరిజ, సంధ్య, శ్రీలక్ష్మి, అంజమ్మ, నాగమణి, కరుణ, పలువురు మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


సమావేశంలో పాల్గొన్న నాయకులు

నడిగూడెం : బీజేపీ పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ అల్పాకాలిక్ పవన్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మేరా బూత్ సబ్‌సే మజ్ బూత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి ఎలా కృషి చేయాలో నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మేకల నాగరాజు, రాష్ట్ర ఓబీసీ అధికార ప్రతినిధి బొలిశెట్టి కృష్ణయ్య, నాయకులు పరబ్రహ్మచారి, లతీఫ్, శోభారాణి, గోపి, కొండయ్య, గౌరమ్మ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మునగాల : మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన బొల్లం పరుశరాములు(32) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా పరుశరాములు పేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో మిత్ర బృందం రూ.21వేలను సేకరించి శనివారం మృతుడి తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు మిత్రులు పాల్గొన్నారు.

సొసైటీలు ఏర్పాటు చేసుకోవాలి

హుజూర్‌నగర్‌రూరల్ : రజక వృత్తిదారులు సొసైటీలు ఏర్పాటు చేసుకోవాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు గూడెపు నాగలింగం అన్నారు. శనివారం మండల పరిధిలోని బూరుగడ్డలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రజకులు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని అన్నారు. సమావేశంలో పలువురు రజక సంఘం నాయకులు ఉన్నారు.